క్లుప్తంగా

ప్రైవేటు ఆసుపత్రుల్లో ధరల పట్టికను పొందుపరచాలి



ప్రైవేటు ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

కడప రూరల్: ప్రైవేట్ ఆస్పత్రుల్లో ధరల పట్టికను పొందుపరచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. గురువారం ఆయన కడప నగరంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేశారు. అందులో భాగంగా స్కానింగ్ సెంటర్ లతోపాటు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆసుపత్రుల్లో ప్రజలకు లభించే వైద్య సేవలను తెలపాలన్నారు. ఫీజులు చెల్లించే వారికి రసీదును ఇవ్వాలన్నారు. ఓపి, ఐపి మొదలగు రికార్డ్స్ ను క్రమ పద్ధతిలో నిర్వహించాలని పేర్కొన్నారు. స్కానింగ్‌లకు సంబంధించి కచ్చితంగా వివరాలు ఆన్ లైన్ లో అప్లోడ్ చేయాలని తెలిపారు. ఆసుపత్రులు క్లినిక్ లు, ల్యాబ్ లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీడమాలజిస్ట్ ఖాజా, డిప్యూటీ హెచ్ఈఓ కుమారి పాల్గొన్నారు.

జాబ్ మేళాకు స్పందన

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల(ఆర్ట్స్ కళాశాల)లో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాకు విద్యార్థుల నుంచి స్పందన లభించింది. కడప నోడల్ రిసోర్స్ సెంటర్‌కు సంబంధించిన కడప ప్రభుత్వ పురుషుల కళాశాలకు వివిధ కళాశాలలకు చెందిన 94 మంది విద్యార్థులు పాల్గొనగా రాత , మౌఖిక పరీక్ష నిర్వహించి 71 మంది విద్యార్థులను వివిధ కంపెనీలకు ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు డా. ఎ.రవీంద్రనాథ్, జేకేసీ కోఆర్డినేటర్ సిహెచ్.రాము, జేకేసీ మెంటార్లు సారధి, రవీంద్రా రెడ్డి పాల్గొన్నారు.

19న కార్యవర్గ ప్రమాణం

కడప సెవెన్‌రోడ్స్ : హోటల్ అండ్ ఫుడ్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఈనెల 19వ తేది సాయంత్రం 6.00 గంటలకు కడప నగరంలోని మానస ఇన్ హోటల్‌లో నిర్వహిస్తున్నామని అసోసియేషన్ గౌరవాధ్యక్షులు లయన్ కె.చిన్నపరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షులు ఎం.నవీన్, సెక్రటరీ పోతుల వెంకట్రామిరెడ్డి, ట్రెజరర్ కె.కిరణ్‌కుమార్‌తోపాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ ఈసీ మెంబర్లు హాజరవుతారన్నారు. నగరంలోని హోటళ్ల యజమానులు కార్యక్రమానికి తరలి రావాలని కోరారు.

పేద విద్యార్థులకు తోడ్పాటు



విద్యార్థినులకు సైకిళ్లను అందజేస్తున్న ఎస్‌బీఐ అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : సామాజిక సేవా కార్యక్రమాలతో పేద విద్యార్థులకు తోడ్పాటు అందించడం సంతోషదాయకంగా ఉందని స్టేట్ బ్యాంకు అధికారులు తెలిపారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ అమరేంద్ర కుమార్ సుమన్ ఆదేశాలతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా 20 మంది పేద విద్యార్థినిలకు గురువారం సైకిళ్లు, స్కూలు బ్యాగులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ హేమ, రీజినల్ మేనేజర్ బి సాయికృష్ణ కిషోర్, శ్రీ శ్రీకాంత్ రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి



ఉప రవాణాశాఖ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలో ఉన్న డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నూర్ మహ్మద్ పేర్కొన్నారు. గురువారం జిల్లాలోని డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇన్‌చార్జ్ జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ వీర్రాజుకు సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో డ్రైవర్లు రాత్రి సమయంలో డ్రైవింగ్ చేసే సమయంలో దొంగలు దాడులు చేస్తున్నారని తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే డ్రైవర్లు విశ్రాంతి తీసుకునే సమయంలో వాహనాల నుంచి డీజిల్‌ను దొంగలించడం వంటివి చేస్తూ బెదిరించి డబ్బులు లాక్కుంటున్నారని తెలిపారు. ఫ్రీ బస్సు పథకంలో ఎక్స్‌ప్రెస్ బస్సులను ఆపగలిగితే ట్యాక్సీ, మ్యాక్సీ డ్రైవర్లకు బాడుగలు కలిగి ఆర్థికంగా కుదుటపడతారని తెలిపారు. ప్రైవేట్ వైట్ బోర్డు వాహనాలలో బాడుగల రూపేంలో ప్యాసింజర్లను తిప్పుతున్నారని వాటిని అరికట్టాలన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అంగీకరించం

– కోటి సంతకాల సేకరణలో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష



48వ డివిజన్‌లో సంతకాల సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష



సమావేశానికి హాజరైన స్థానిక ప్రజలు

కడప కార్పొరేషన్: ప్రభుత్వం ద్వారా నాణ్యమైన వైద్యం పొందడం ప్రజల హక్కు అని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష అన్నారు. గురువారం సాయంత్రం 48వ డివిజన్‌లోని హోమియోపతి కళాశాల వద్ద ఆ డివిజన్ ఇన్‌చార్జి బంగారు నాగయ్య యాదవ్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. వర్షాన్ని కూడా లెక్కచేయక సంతకాల సేకరణ ఉద్యమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా అంజద్‌బాష మాట్లాడుతూ చాలా కుటుంబాలు తమ ఆదాయంలో అత్యధిక భాగాన్ని విద్య, వైద్యం కోసం ఖర్చు చేస్తున్నాయన్నారు. నాణ్యమైన వైద్యం కోసం ఆస్తులు అమ్ముకోవడమో, అప్పులు చేయడమో చేస్తున్నామన్నారు. ఫలితంగా మధ్య తరగతి వారు పేద వారిగా, పేదవారు మరింత పేదలుగా మారుతున్నారన్నారు. పాదయాత్రలో ఇలాంటి ఎన్నో గాథలను స్వయంగా విన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించి రాష్ట్రానికి 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మంజూరు చేయించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అందులో 10 కాలేజీలను ప్రైవేటు పరం చేయాలని నిర్ణయించడం దారుణమన్నారు. ఈ కాలేజీలు ప్రైవేటు పరమైతే వారు లాభాలు దృష్టిలో ఉంచుకొని పనిచేస్తారని, దీనివల్ల పేద, మధ్య తరగతి ప్రజలు నాణ్యమైన వైద్యాన్ని హక్కుగా పొందే అవకాశాన్ని కోల్పోతారన్నారు. ప్రైవేటు నియంత్రణ వల్ల వైద్య చికిత్సలు ఖరీదవుతాయని, పెట్టుబడిని రాబట్టుకోవడానికి దోపిడీ పెరుగుతుందని, రోగులపై అధిక భారం పడుతుందని హెచ్చరించారు. కోవిడ్ సమయంలో ప్రైవేటు ఆసుపత్రులు మూసివేస్తే ప్రభుత్వ ఆసుపత్రులు మాత్రమే ఆ భారాన్ని మోశాయని గుర్తు చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీని పూర్తిగా దెబ్బతీశారని, ఆరోగ్య ఆసరా కూడా రద్దు చేశారన్నారు. ఆరోగ్యశ్రీ బకాయిలను చెల్లించలేదన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల సేకరణ చేపట్టిందని, ప్రజలు దీన్ని విజయవంతం చేయాలని కోరారు. 48వ డివజన్ ఇన్‌చార్జి బంగారు నాగయ్య యాదవ్ మాట్లాడుతూ 48వ డివిజన్‌లో అనేక ఏళ్లుగా కుల ధ్రువీకరణ పత్రాలు లేని చెంచులకు గంటల వ్యవధిలో సర్టిఫికెట్లు ఇప్పించిన ఘనత మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాదేనని గుర్తు చేశారు. డివిజన్‌లో జరిగిన అభివృద్ధి అంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే జరిగిందని, కూటమి ప్రభుత్వంలో ఏమీ జరగలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మేయర్ ముంతాజ్ బేగం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాక సురేష్, కార్పొరేటర్లు షఫీ, బాలస్వామిరెడ్డి, జోనల్ అధ్యక్షులు బీహెచ్ ఇలియాస్, రామ్మోహన్‌రెడ్డి, నాగమల్లారెడ్డి, దాసరి శివ, సింధే రవి, జమాల్‌వలీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కుర్చీ మాత్రమే ముఖ్యం



సంతకాల సేకరణ చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష, మాజీ మేయర్ సురేష్ బాబు



కోటి సంతకాల సేకరణకు హాజరైన ప్రజలు

కడప కార్పొరేషన్: కడప ఎమ్మెల్యే మాధవికి కుర్చీ మాత్రమే ముఖ్యమని, ప్రజా సమస్యలుగానీ, నగరాభివృద్ధిగానీ ఆమెకు పట్టదని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష విమర్శించారు. గురువారం ఉదయం 23వ డివిజన్‌లో నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో మాజీ మేయర్ కె. సురేష్ బాబుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజద్‌బాష మాట్లాడుతూ ఎమ్మెల్యే మాధవి వీలైతే కలెక్టర్ కుర్చీ కూడా కావాలంటుందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ 16 నెలల్లో కడప అభివృద్ధికి నయాపైసా నిధులు తేలేదని తెలిపారు. బుగ్గవంకలో కంపచెట్లు తొలగించడానికి రూ.20లక్షలు ఖర్చుపెట్టి...ఎమ్మెల్యే, ఆమె భర్త రూ.3కోట్లకుపైగా జేబులో వేసుకున్నారని ఆరోపించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఆపడానికి ఎంత పోరాటం చేయడానికైనా సిద్ధమని ప్రకటించారు. మాజీ మేయర్ కె. సురేష్ బాబు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడానికి ఈ ప్రభుత్వానికి సిగ్గుండాలన్నారు. ప్రైవేటీకరణ వల్ల విద్య, వైద్యం ఖరీదుగా మారుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటీకరణను అడ్డుకోవడానికి ప్రజలంతా నడుం బిగించాలని సూచించారు. ప్రజల ద్వారా సేకరించిన సంతకాలను వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గవర్నర్‌కు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్రారెడ్డి, 23వ డివిజన్ కార్పొరేటర్ టి. విజయలక్ష్మి, జోనల్ అధ్యక్షులు ఐస్‌క్రీం రవి, ఇలియాస్, రామ్మోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు పి. క్రిష్ణమూర్తి, రెడ్డి ప్రసాద్, షఫీ, టీపీ వెంకట సుబ్బమ్మ, బి. మరియలు, రమేష్ రెడ్డి, షఫీవుల్లా పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న మహ్మద్ అబ్దుల్

కడప ఎడ్యుకేషన్: కడప మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ (మను) పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డా. మహ్మద్ అబ్దుల్ ముక్సిత్ ఖాన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన బీహార్ రాష్ట్రంలోని దర్భంగా నుండి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇంత వరకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహించిన మిర్జా విలాయత్ అలీ బైగ్ హైదరాబాదులోని మాను ప్రధాన క్యాంపస్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ప్రిన్సిపల్ డా. అబ్దుల్ ముక్సిత్ ఖాన్‌కు ఘన స్వాగతం పలికారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వరి

కడప ఎడ్యుకేషన్: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వరి అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు కడపలోని రైల్వేకాలనీ, మేరీ నగర్‌లలో స్పెషల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి ఆఫీసర్ చెప్పలి రాజారావు మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో స్వచ్ఛభారత్ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు చంద్రమౌళి, రామసుబ్బయ్య, హరికృష్ణ, శివశంకర్, ఎస్ఎస్ఎస్ విద్యార్థులు, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం మేరీ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేడు ఆర్ట్స్ కళాశాలలో ఎన్‌సీసీ ఎంపికలు

కడప ఎడ్యుకేషన్: దేశభక్తి, క్రమశిక్షణ, త్రివిధ దళాలలో ఉద్యోగ అవకాశాలు కోసం ఎన్‌సీసీ ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధాన ఆచార్యులు డాక్టర్ జి రవీంద్రనాథ్ అన్నారు. శుక్రవారం 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాలలో ఎన్‌సీసీ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ డాక్టర్ నీలయ్య తెలియజేశారు. నాయకత్వ లక్షణాలు, మంచి శరీర సౌష్టవం, ఎటువంటి సమస్యలు ఎదురైనా ఎదుర్కొనే దృఢ సంకల్పం ఎన్‌సీసీ ద్వారా అలవడతాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు. ఎంపికలకు హాజరయ్యే విద్యార్థులు సంబంధిత ధ్రువ పత్రాలతో శుక్రవారం ఉదయం 6 గంటలకు కళాశాల ఎన్‌సీసీ అధికారులను సంప్రదించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ మహేష్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం నియంతృత్వ పోకడలను ఆపాలి



మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం నియంతృత్వ పోకడలను మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని సీపీఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ తీవ్రంగా హెచ్చరించారు. గురువారం ఐటిఐ సర్కిల్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం ఎదుట సిపిఎం నేతలు నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఈ నిరసన కార్యక్రమానికి పోలీసులు అనుమతి కోరినా ఇవ్వకుండా దుర్మార్గంగా వ్యవహరించడం సమంజసం కాదని తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా నిరసన కొనసాగిస్తామని చెప్పినా పోలీసులు అంగీకరించకుండా తమ పార్టీ జెండాలు, బ్యానర్ ను లాక్కోవడం సరైనది కాదన్నారు. జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని అందుకే తమ పార్టీ నిరసనకు పిలుపునిచ్చిందన్నారు. కర్నూలు పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీ 2014లో రాష్ట్ర విభజన సందర్భంగా కడప ఉక్కు ఫ్యాక్టరీని ఆరు నెలల్లో ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని ఎందుకు అమలు చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 2018 ఫిబ్రవరి 28న కర్నూలు లో జరిగిన బిజెపి డిక్లరేషన్ లో రాయలసీమకు రూ. 20వేల కోట్ల ప్యాకేజీ ప్రకటించాలని చేసిన డిమాండ్ ను కూటమినేతలు ఎందుకు అమలు చేయలేదో స్పష్టం చేయాలన్నారు. అటు కేంద్రంలోనూ ఇటు రాష్ట్రంలోనూ కూటమి పార్టీలే అధికారంలో ఉన్నాయని గుర్తు చేశారు. అయినా రాష్ట్ర ప్రయోజనాలు కాపాడడంలో టిడిపి జనసేన పార్టీలు బిజెపికి తొత్తులుగా మారాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి, కామనూరు శ్రీనివాసులరెడ్డి, చంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, రవి, నరసింహ, జార్జి, గోవిందు, తిమ్మయ్య, విజయ్, రఘు, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక విద్యుత్ అదాలత్‌కు స్పందన



వినియోగదారుల సమస్యలు తెలుసుకుంటున్న విశ్రాంత న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయమూర్తి

కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో కడప డివిజన్ కార్యాలయంలో గురువారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ×ప్రత్యేక విద్యుత్ అదాలత్×కు విశేష స్పందన లభించింది. విశ్రాంత న్యాయమూర్తి వి. శ్రీనివాస ఆంజనేయమూర్తి ఈ అదాలత్‌కు హాజరై విద్యుత్ వినియోగదారుల దీర్ఘకాలిక సమస్యలను తెలుసుకొని పరిష్కారం చూపారు. కడప డివిజన్ పరిధిలోని టౌన్-1, టౌన్-2, రూరల్-1, రూరల్-2 ఒంటిమిట్ట సబ్ డివిజన్ పరిధిలోని సెక్షన్లు, మండలాలకు సంబంధించిన వినియోగదారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కడప నగరానికి చెందిన ఎస్. చంద్రశేఖర్‌రెడ్డి అనే వినియోగదారుడికి 5 సర్వీసులు ఉండగా, ఏడు సర్వీసులు లింక్ అయ్యాయి. దీనిపై ఆయన ఫిర్యాదు చేయడంతో మిగిలిన రెండు సర్వీసులు తొలగిస్తూ చర్యలు తీసుకున్నారు. అలాగే వినియోగదారులు తెలిపిన వివిధ సమస్యలను కూడా పరిష్కరించారు.

ఈ కార్యక్రమంలో ఆర్థిక సభ్యులు జి. మధు కుమార్; సాంకేతిక సభ్యులు ఏ. శ్రీనివాస బాబు, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి, కడప డివిజన్ ఈఈ ఎస్. హరిసేవ్యా నాయక్, ఎస్ఏఓ ప్రసన్నాంజనేయులు పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయం వేదికగా గొప్ప సాహిత్య సేవలందిస్తాం



సీపీ బ్రౌన్ నిర్మాణ పనుల గురించి తెలుసుకుంటున్న వీసీ బెల్లంకొండ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్: సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం వేదికగా తెలుగు భాషా సాహిత్యాలను మరింత విస్తృతపరుస్తూ ఆ దిశగా గొప్ప సాహిత్య సేవలందిస్తామని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా బెల్లంకొండ రాజశేఖర్ కడప నగరంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. బ్రౌన్ గ్రంథాలయం వెనుక నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాలను పరిశీలించారు. నూతన భవనాన్ని త్వరలోనే పూర్తిచేస్తామన్నారు. బ్రౌన్ నివాసమున్న బంగళా, సమాధి చిత్రాలను పరిశీలించి బ్రౌన్ సాహితీ సేవలను, గ్రంథాలయ నిర్మాణానికి ఎవరెవరు ఎంత కృషిచేశారన్న అంశాలను తెలుసుకున్నారు. భాషా పరిశోధన కేంద్రంలో ఉన్న పుస్తకాలను, తాళపత్రగ్రంథాలను, హ్యాండ్‌మేడ్ పేపర్స్, తామ్రపత్రాన్ని, సిద్ధాంత గ్రంథాలను, బ్రౌన్ రచనలను పరిశీలించారు. గ్రంథాలయ నిర్వహణ, విధివిధానాలను తెలుసుకొని సాహిత్యపరంగా బ్రౌన్ కేంద్రాన్ని మరింత ఉన్నతికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైవీయూ కులసచివులు ఆచార్య పుత్తా పద్మ, ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది, కాంట్రాక్టర్ మోహన్‌రెడ్డి, నాగరాజు, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, సంచాలకులు ఆచార్య జి.పార్వతి, సహాయ పరిశోధకులు డా.చింతకుంట శివారెడ్డి, డా.భూతపురి గోపాలకృష్ణశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

గంటలకొద్దీ నిరీక్షణ

నాయకులు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలి. అలాంటిది తమ పర్యటనలు, ఏర్పాటు చేస్తున్న సభల కారణంగా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. గురువారం కర్నూలు జిల్లాలో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జీఎస్టీ సభ ప్రజలకు అనేక కష్టాలు తీసుకొచ్చింది. ముందుగా నిర్ణయించుకున్న మేరకు వివిధ పనులు, కార్యక్రమాల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన తరుణంలో బస్సులు లేకపోవడంతో ప్రజలు నానా కష్టాలు పడ్డారు. గంటల కొద్దీ వేచి చూసిన తర్వాత కొందరు ఇక బస్సులు రావని తెలుసుకుని ప్రైవేటు వాహనాలలో వెళ్లారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, కడప



కడప పాత బస్టాండులో బస్సుల కోసం తప్పని నిరీక్షణ



ఆర్టీసీ బస్టాండులో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణీకులు



కడప ఆర్టీసీ బస్టాండులో ఒక్క బస్సు లేని దృశ్యం

ఎన్‌సీసీ కార్యక్రమాలపై అవగాహన

కడప ఎడ్యుకేషన్: ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ గవర్నమెంట్ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థుల ప్రవేశ కార్యక్రమంపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గణితశాస్త్ర విభాగ ఉపన్యాసకురాలు ఎన్‌సీసీ ప్రోగ్రాం ఆఫీసర్ స్వరూప విద్యార్థులతో చర్చ జరిపి ఎన్‌సీసీ భాగస్వామ్యం వలన విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం కలుగుతుందన్నారు. ప్రిన్సిపల్ డా. వి. సలీం బాషా విద్యార్థులు ఎన్‌సీసీ కేడెట్లుగా చేరేందుకు ఆసక్తి చూపాలని కోరారు. ఎంపిక శారీరక సామర్థ్య పరీక్షల ఆధారంగా జరుగుతుందని తెలిపారు. అనంతరం ప్రభుత్వ హోమియోపతి కళాశాలకు చెందిన డా. షేక్ షమీర్ హుస్సేన్, వైద్యుల బృందం కార్డియో పల్మనరీ రీససిటేషన్ పై అవగాహన మరియు ప్రాక్టికల్ ప్రదర్శన నిర్వహించారు. హృదయ స్పందన ఆగడం, విద్యుత్ షాక్, ప్రమాదాలు, గుంపు తొక్కిసలాట వంటి అత్యవసర సందర్భాల్లో సీపీఆర్ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్ఐపి కమిటీ సభ్యులు ప్రకాష్ నారాయణ రెడ్డి, కుమార్, డాక్టర్ ఎం. గురు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవన ఎరువుల వినియోగంపై సదస్సు

కడప అగ్రికల్చర్: రైతులు జీవన ఎరువులు వాడాలని ఊటుకూరు కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త శిల్పకళ పేర్కొన్నారు. గురువారం ఊటుకూరు కేవీకేలో జీవన ఎరువుల వాడకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన కోసం ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం వారం రోజులపాటు జీవన ఎరువుల అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తోందన్నారు. జీవన ఎరువుల వాడకం గురించి ఉద్యానశాస్త్రవేత్త మానస వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే పశువిజ్ఞాన శాస్త్రవేత్త సురేష్‌కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బాలవికాస్ స్కూల్‌కు జాతీయ స్థాయిలో 26వ ర్యాంకు



అవార్డును అందుకుంటున్న బాలవికాస్ డైరెక్టర్ గంగయ్య

కడప ఎడ్యుకేషన్: ఎడ్యుకేషన్ వరల్డ్ ఇండియా వారు జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాలలో సర్వే నిర్వహించి విద్యా రంగంలో విశిష్ట సేవలందిస్తున్న విద్యా సంస్థలకు ర్యాంక్‌లతో పాటు అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యూ ఢిల్లీ ఏరో సిటీ లోని పుల్మాన్ హోటల్‌లో ఈ అవార్డుల కార్యక్రమం నిర్వహించగా జాతీయ స్థాయి బడ్జెట్ పాఠశాలల కేటగిరిలో కడప నగరంలోని బాలవికాస్ ఉన్నత పాఠశాలకు కడప జిల్లా 2 వ ర్యాంక్, రాష్ట్ర స్థాయిలో 5 వ ర్యాంక్, జాతీయ స్థాయిలో 26 వ ర్యాంక్ బాలవికాస్ హై స్కూల్‌కి దక్కిందని పాఠశాల డైరెక్టర్ గంగయ్య తెలిపారు. ఈ అవార్డును పాఠశాల డైరెక్టర్ గంగయ్య, కరెస్పాండంట్ సుబ్బరాయుడు స్వీకరించారు.

ఆహార ఉత్పత్తులలో ఆధునిక మార్గాలు అన్వేషించాలి

కడప ఎడ్యుకేషన్: ఆహార ఉత్పత్తులలో ఆధునిక మార్గాలను అన్వేషించాలని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయంలోని ఫుడ్ టెక్నాలజీ శాఖ విభాగాధిపతి ప్రొఫెసర్ రియాజున్నీసా ఆధ్వర్యంలో × వరల్డ్ ఫుడ్ డే× ఉత్సవాలను గురువారం సైన్స్ బ్లాక్ లోని సెమినార్ హాల్లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బెల్లంకొండ రాజశేఖర్ మాట్లాడుతూ ఆహార పదార్థాల వృధాను పూర్తిగా అరికట్టాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. ఆహార భద్రత పట్ల ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. న్యూ బెర్గ్ ఆనంద్ అకాడమీ ఆఫ్ లేబరేటరీ మెడిసిన్ ప్రైవేట్ లిమిటెడ్ డీన్ ప్రొఫెసర్ కేఎస్ చిదంబర మూర్తి మాట్లాడుతూ ప్రాథమిక ఆహార అవసరాలు, సరైన పోషకాహారంతో మెడికల్‌ను దూరంగా ఉంచడం, ఆహార దినోత్సవం సందర్భంగా యువత లక్ష్యం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. రిజిస్ట్రార్ ప్రొ. పుత్త పద్మ, స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ ఎ.జి. దాము, సైన్స్, టెక్నాలజీ, ఆహార స్థిరత్వం గురించి మాట్లాడారు. ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి ప్రొ. కె. రియాజున్నీసా మాట్లాడుతూ సమతుల్య పోషకాహారం, స్థిరమైన ఆహార సాధన గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫుడ్ టెక్నాలజీ శాఖ గురించి వివరించారు. అనంతరం విద్యార్థులు సంప్రదాయ, పోషకాహారపు వంటకాలను ప్రదర్శించారు.

డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా

కడప ఎడ్యుకేషన్: గిరిజన విద్యార్థిపై దాడి చేసిన పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి యువజన ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కడప డీఈఓ కార్యాలయం వద్ద విద్యార్థి విక్షిత్‌నాయక్‌పై దాడికి నిరసనగా విద్యార్థి తల్లిదండ్రులు బంధువులతో కలిసి విద్యార్థి యువజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగర పరిధిలోని వికాస్ దిన్నెపాటి బసిరెడ్డి పాఠశాల కరస్పాండెంట్ పాఠశాల నవోదయ సైనిక్ కోచింగ్ సెంటర్‌కు అనుమతి లేకపోయినా పాఠశాల విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. సికెదిన్నె మండలం సుగాలిబిడికి చెందిన 5వ తరగతి విద్యార్థి విక్షిత్ నాయక్‌ను విచక్షణ రహితంగా కొట్టారని ఆరోపించారు. దీనిపై విద్యాశాఖ అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు అంకన్న, ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డీఎం ఓబులేసు, ఆర్ఎంపిఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్‌రాజా, ఏఐఎస్‌బి జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్రప్రసాద్, పిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు, ఏఐబిఎస్ఎస్ జిల్లా కార్యదర్శి జగన్నాయక్, ఆర్‌వీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.